సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 3 । జూన్ । 2025


రెండో రోజూ అవే అవస్థలు IIలో


అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి IIలో


యోగా డే.. భారం మీదే..! IIలో

న్యూస్‌రీల్

ఐఐఎంవీలో పీజీ ప్రోగ్రాం ప్రారంభం


పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరిన వారితో నిర్వాహకులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం)లో రెండేళ్లపాటు కొనసాగే పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఐఐఎంవీ డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్ ప్రారంభ ఉపన్యాసంలో మాట్లాడుతూ.. దేశంలోని అగ్రశ్రేణి సాంకేతిక సంస్థల నిపుణుల కోసం ప్రత్యేక నాయకత్వ సామర్థ్యాన్ని పెంపొందించడానికి, కొత్త తరం టెక్నో మేనేజర్‌లను సృష్టించడానికి ఈ కోర్సును రూపొందించినట్లు తెలిపారు. ఈ కోర్సులో పాల్గొనే విద్యార్థులు మొదటి ఏడాది చివరిలో మేనేజ్‌మెంట్‌లో డిప్లమో పొందవచ్చని, ఎంబీఏ డిగ్రీ కోసం రెండో ఏడాది కూడా కొనసాగవచ్చని ఆయన వివరించారు. ఈ బ్యాచ్‌లో మొత్తం 72 మంది విద్యార్థులుండగా, 62 మంది రెండో సంవత్సరం కూడా కొనసాగడానికి ఆసక్తి చూపినట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్ ప్రొఫెసర్ షమీమ్ పాల్గొన్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా కుమార్‌రాజు


కుమార్‌రాజును సత్కరిస్తున్న గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం

డాబాగార్డెన్స్: శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా పనిచేసిన బుర్రి కుమార్‌రాజు సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఆయనను ఘనంగా సత్కరించింది. ఉద్యోగుల సంక్షేమానికి సహకరించాలని సంఘం ప్రతినిధులు ఈ సందర్భంగా కుమార్‌రాజును కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

రూఫ్‌టాప్ సోలార్‌తో జీరో బిల్


రూఫ్ టాప్ సోలార్‌పై అవగాహన ర్యాలీ

సీతంపేట: ప్రతి విద్యుత్ వినియోగదారుడు తమ ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే కరెంటు బిల్లు రాదని, అంతేకాకుండా మిగిలిన విద్యుత్‌ను తిరిగి విక్రయించుకునే అవకాశం ఉందని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి. శ్యాంబాబు స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ రూఫ్‌టాప్ సోలార్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో సోమవారం సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంబాబు మాట్లాడుతూ, 'జీరో బిల్' నినాదంతో రూఫ్‌టాప్ సోలార్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే గృహ అవసరాలకు సరిపడా విద్యుత్ ఉత్పత్తి అవ్వడమే కాకుండా, మిగిలిన ప్రతి యూనిట్ విద్యుత్‌కు వినియోగదారునికి రూ.2.09 చెల్లిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏఈలు, ఏడీలు, ఈఈలు పాల్గొన్నారు.

రేపు అప్రెంటిస్‌షిప్ మేళా

తాటిచెట్లపాలెం: పారిశ్రామిక శిక్షణ సంస్థలలో కోర్సులను పూర్తిచేసి, అప్రెంటిస్ చేయని వారికోసం బుధవారం పాత పారిశ్రామిక శిక్షణ సంస్థ, విశాఖపట్నంలో అప్రెంటిషిప్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, జోన్-1 ఉపసంచాలకులు ఆర్‌వీ రమణ పేర్కొన్నారు. ఐటీఐలో వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్ ట్రేడులలో పాసైన, 25 ఏళ్లలోపు వయస్సు గల అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. మేధ సర్వో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తుందని ఎంపికైన వారికి నెలకు రూ.15,000 వేతనం, ఇతర అలవెన్సులు కల్పిస్తుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు బుధవారం ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు.



ఒకటో తేదీ... ఒకప్పుడు ఎంతో ఆనందాన్ని, భరోసాని మోసుకొచ్చేది. అవ్వాతాతల ముఖాల్లో చిరునవ్వులు పూయించేది. వారి కళ్లల్లో ఆనందపు మెరుపులు నింపేది. పింఛను డబ్బులు చేతికి అందగానే, నెలరోజులకు సరిపడా అవసరాలు తీరతాయన్న ధైర్యం, పిల్లలపై ఆధారపడకుండా బతికేస్తున్నామన్న సంతృప్తి వారిని నిలబెట్టేవి. ఇంటి వద్దకే వచ్చి, క్షేమ సమాచారాలు అడిగి, చేతిలో పింఛను పెట్టి వెళ్లే మనుషులు ఆత్మీయుల్లా కనిపించేవారు. ఇప్పుడు ఆ పిలుపు, ఆ స్పర్శ, ఆ భరోసా కనిపించడం లేదు. 'అవ్వా... తాతా...' అనే పిలుపు లేదు. పండుటాకుల కళ్లల్లో ఆనందం లేదు. వారికి భరోసా ఇచ్చే మనుషులు ఇంటికి రావడం లేదు. ఒకటో తేదీ వచ్చిందన్న సంతోషం ఎవరి మోముల్లోనూ వికసించడం లేదు. పింఛను కానుకగా అందుకున్న ఆ రోజులు పోయాయి. కాసుల కోసం కాపలా కాసే రోజులు మళ్లీ వచ్చేశాయి. ఆ వృద్ధాప్యం, ఆ అనారోగ్యం, ఆ బలహీనత... ఇవేవీ లెక్కలో లేనట్టుగా, ప్రభుత్వ నిర్ణయం వారికి కష్టాలు తెచ్చిపెట్టింది.


రోడ్డుపై పింఛన్ పంపిణీ


నా పింఛన్ ఏదీ.. వృద్ధురాలి ఆవేదన

కూటమి కోత

- మళ్లీ పింఛన్ వంచన
- తలుపుతట్టి ఇస్తామని చెప్పి.. సచివాలయాల్లో పంపిణీ
- అవస్థలు పడుతున్న అవ్వాతాతలు
- పింఛన్ల కోతపైనే కూటమి దృష్టి

జిల్లాలో ఏడాదిలో 9,806 పింఛన్లు కట్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో పింఛన్లు	కూటమి ప్రభుత్వం హయాంలో జిల్లాలో పింఛన్లు
1,68,891	రూ.1,59,085


ఇదీ పంపిణీ వరుస..


పింఛన్ పాట్లు

మహారాణిపేట: **కూటమి ప్రభుత్వం అందరూ ఊహించినట్లుగానే వ్యవహరిస్తోంది.. అబద్ధాల కోటపై పాగా ఎగరేసిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి అడుగులోనే అవ్వాతాతలపై కక్ష** కట్టినట్లుగా పింఛను వంచన మొదలు పెట్టింది. గతంలో సీఎంగా పనిచేసిన చంద్రబాబు వృద్ధుల విషయంలో ఎలా దుర్మార్గంగా వ్యవహరించారో, ఇప్పుడూ అదే పాత కఠినమైన పద్ధతిని అమలు చేస్తున్నారు. ఇది కేవలం మాట తప్పడం కాదు, వృద్ధాప్య బలహీనతను, నిస్సహాయతను అమానుషంగా దోచుకోవడమే.

గతంలో రాజకీయాలకు అతీతంగా..

సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్న సమయంలో రాజకీయాలకు అతీతంగా పింఛన్ల పంపిణీ జరిగింది. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ.. ఇలా ఎవరికీ సంబంధం లేకుండా వలంటీర్లు నేరుగా కోడి కూయకముందే తమ పరిధిలో మ్యాపింగ్ అయిన ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు పింఛను అందించేవారు. తెల్లవారు జామునే తమ ఇంటి **వద్దకు పింఛను డబ్బులు చేరడంతో అవ్వాతాతలు ఎంతో సంతోషించేవారు. ప్రస్తుతం వారంతా తీవ్ర ఇబ్బందులు చవిచూస్తున్నారు. ఇది చాలదన్నట్టుగా చాలా చోట్ల 'సర్వర్ మొరాయించిందంటూ' కుంటి** సాకులు చెబుతూ మధ్యాహ్నం 12 గంటల వరకు పింఛన్లు ఇవ్వడం లేదు. ఉదయం నుంచి వేచి ఉన్న వృద్ధులు, సరైన భోజనం లేక, తాగడానికి నీళ్లు లేక పడిన అవస్థలు వర్ణనాతీతం.

హామీల భారం.. రాజకీయ కక్ష

ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబు అమలుకాని హామీలు గుప్పించారు. రూ.3,000 ఉన్న పింఛన్లను రూ.4,000 లకు పెంచుతానని హామీ ఇచ్చారు. తీరా అధికారం చేపట్టాక అది భారంగా పరిణమించినట్లు అర్థమైపోయింది. దీంతో కొంత భారాన్ని తగ్గించుకోవాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు టీడీపీకి అనుకూలంగా లేరన్న అనుమానం ఉన్న పేర్లను తప్పించే ప్రక్రియ జరుగుతోంది.

ప్రతి నెలా తగ్గింపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ పింఛను సంఖ్య వరుసగా తగ్గుతూ వస్తోంది. మృతి చెందిన వారి పేర్లు జాబితా నుంచి తప్పిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ.. కారణం తెలియకుండానే కొంత మంది లబ్ధిదారులపై వేటు పడుతోంది. తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా లేరన్న అక్కసుతో స్థానిక నేతల ఒత్తిళ్లతో కొంత మంది పేర్లు తప్పించారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో ప్రతి నెలా పింఛన్ దారుల సంఖ్య తగ్గుకుంటూ వస్తోంది. మున్ముందు భారీగా సామాజిక పింఛన్లలో కోత విధించే అవకాశాలు ఉన్నట్లు సంకేతాలు వస్తున్నాయి.

ఏడాది పాలన అంతులేని వేదన



సమీపంలోని సచివాలయం వద్దకు పండుటాకులు చేరుకొని పింఛన్లు తీసుకుంటున్నారు. పెదజాలారిపేట వద్ద ఎప్పుడూ ఉదయం 10 గంటలలోపు పింఛన్లు ఇవ్వడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ విభాగం, నగర పరిధిలో జీవీఎంసీ పింఛన్లు పంపిణీ చేస్తున్నాయి.

ప్రతీ నెలా కోత ఇలా..

నెల	పింఛన్లు	తగ్గుదల
2024 జూలై	1,63,210	5,681
2024 ఆగస్టు	1,62,150	1060
2024 సెప్టెంబర్	1,62,000	150
2024 అక్టోబర్	1,61,96	931
2024 నవంబర్/ డిసెంబర్	1,61,584	385
2025 జనవరి	1,61,271	313
2025 ఫిబ్రవరి	1,60,757	514
2025 మార్చి	1,60,102	655
2025 ఏప్రిల్	1,59,903	199
2025 మే	1,59,624	279
2025 జూన్	1,59,085	539
మొత్తం తొలగించిన పింఛన్లు		9,806

బయోమెట్రిక్ గుర్తింపు ద్వారానే లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఈ కోతలు, ఆలస్య పంపిణీ పట్ల ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోతోంది.

జగన్ పాలనలో ఆదరణ.. కూటమి పాలనలో నరకం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు తలుపు తట్టి మరీ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఐదేళ్ల పాటు అవ్వా తాత, దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు.. ఇలా ప్రతి ఒక్క లబ్ధిదారుడికీ ఎలాంటి కష్టం రాకుండా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకుంటూ పింఛను అందజేసింది. వారి ముఖాల్లోని సంతోషమే ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలిచింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి రోజు నుంచే లబ్ధిదారులను కష్టాల్లోకి నెట్టేసింది. ఆ వలంటీర్ల వ్యవస్థను, వారి సేవలను పూర్తిగా పక్కన పెట్టేసి, పింఛన్లు ఇచ్చేది లేదంటూ వారిని దూరం చేసింది. గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇవ్వాల్సిందేనంటూ తెగేసి చెప్పి, వారి ద్వారా పింఛన్లు పంపిణీ చేయిస్తున్నారు. ఇక్కడి నుంచే అసలు నరకం మొదలైంది.

చుక్కలు చూస్తున్న అవ్వాతాతలు

ఒకటో తేదీ ఉదయం 9 గంటలైనా కొన్ని ప్రాంతాల్లో పింఛను సొమ్ము చేతికి అందక అవ్వాతాతలకు చుక్కలు కనిపిస్తున్నాయి. గతంలో ఒకటో తేదీ వస్తే పింఛనుదారుల్లో ఆనందం కనిపించేది. కానీ ఇప్పుడు పండుటాకుల్లో బాధలు ఎదురయ్యాయి. ఎప్పుడు అందుతుందో తెలియని స్థితిలో పింఛనుదారులు ఉన్నారు. ముందుగా సర్వర్ పనిచేయడం లేదని సమాచారం ఇవ్వడంతో పింఛనుదారుల్లో కలవరం మొదలైంది.

9,806 పింఛన్లు రద్దు

జిల్లాలో 2024 ఎన్నికల ముందు వరకు 1,68,891 మంది పింఛనుదారులు ఉండేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి నెలా వెయ్యికి పైగా కోత పెడుతూ వచ్చారు. దీంతో జూన్‌లో జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 1,59,085కి చేరుకుంది. 9,806 పింఛన్లు తొలగించారు. ఈ తగ్గింపు వెనుక సాంకేతిక కారణాలు చూపించడానికి అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. కొంత మందికి సర్వర్‌లో సమస్య, మరికొంత మందికి వచ్చే నెల నుంచి వస్తాయని, ఇంకొందరికీ మరో కారణం చెప్పి తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారు.


ఆస్పత్రిలో రోగికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

ఇలాగైతే నాలుగేళ్లలో స్టీల్‌ప్లాంట్ మూత

- టన్ను ఐరన్ తయారీకి రూ.2.5 లక్షల ఖర్చు
- ఘోస్ట్ ఉద్యోగులు విధులకు రాకుండా జీతాలు తీసేసుకుంటున్నారు..
- 400 మంది కార్మిక నాయకులు యు పాస్ పేరుతో సంతకాలు చేసి వెళ్లిపోతున్నారు..
- ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కీలక వ్యాఖ్యలు



సాక్షి, విశాఖపట్నం: 'విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఒక టన్ను ఐరన్ తయారు చేయడానికి రూ.2.5 లక్షలు ఖర్చవుతోంది.. పరిస్థితి ఇలాగే ఉంటే ప్లాంట్ మరో నాలుగేళ్లలో మూత పడుతుంది. దీన్ని కాపాడటం కోసమే మేము రూ.14 వేల కోట్ల నిధులను తీసుకొచ్చాం. కానీ ఇక్కడ ఘోస్ట్ ఉద్యోగులు విధులకు రాకుండానే జీతాలు తీసేసుకుంటున్నారు. సుమారు 400 మంది కార్మిక నాయకులు డ్యూటీకి వచ్చి సంతకాలు పెట్టిన తరువాత 'యు పాస్' పేరుతో వెళ్లిపోతున్నారు. మేము తెచ్చిన నిధులను జీతాలకు పంచేసి ఇదే పరిస్థితిని కొనసాగిస్తే ఈ పరిశ్రమ మరో నాలుగేళ్ల తరువాత మూతపడిపోతుంది.

వడ్లపూడిలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటన సమయంలో వీరావేశంతో నిరాహారదీక్షకు దిగిన ఆయన ఇప్పుడు ఇలా మాట్లాడటం సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

టన్ను ఉక్కు తయారీకి రూ.57 వేలు

స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత సామర్థ్యం 7.3 మిలియన్ టన్నులు. ఇక్కడ మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లున్నాయి. కొద్దికాలం పాటు రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లను నిలిపివేశారు. ప్రైవేటీకరణ ప్రకటన వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వం తన పంతం నెరవేర్చుకోవడానికి సహాయ నిరాకరణ చేపట్టింది. అందులో భాగంగా ముడిసరుకు సరఫరా కానివ్వకుండా, రైల్వే ర్యాక్‌లు ఇవ్వనివ్వకుండా, చివరకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయకుండా మోకాలడ్డి ప్లాంట్‌ను పూర్తిగా నిర్వీర్యం చేయాలని చూసింది. ఒకానొక దశలో ఒక ఫర్నేస్ నడపడానికి కూడా అవకాశం లేని పరిస్థితులు సృష్టించింది. కార్మికుల పోరాటంతో ఇప్పుడు రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌ను తెరిచారు. మూడో ఫర్నేస్ ఇంకా మూతపడి ఉంది. ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడంతో ఉత్పత్తి వ్యయం టన్నుకు సుమారు రూ.57 వేలు ఖర్చవుతున్నట్టు పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం టన్ను ఐరన్‌ను సుమారు రూ.63 వేలకు విక్రయిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కార్మికులు దశాబ్దాల తరబడి పోరాడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీంతో ఉత్పత్తి వ్యయం కూడా పెరిగిపోతుంది. దీనికి కూడా కార్మికులదే తప్పు అనే విధంగా ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారని, ఉత్పత్తి వ్యయంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కార్మికులు పేర్కొంటున్నారు.

ఉద్యోగాలు తీసేసినా ఫర్వాలేదా?

తాను ఎవరి ఉద్యోగానికీ జవాబుదారీ కాదని, కేవలం ఆర్ కార్డులున్న నిర్వాసితులకు అన్యాయం జరిగితే మాత్రం సహించబోనని ఎమ్మెల్యే చెప్పడం వెనుక స్థానికులు విస్మయం చెందుతున్నారు. నిర్వాసితులు కాకుండా మిగిలినవారి ఉద్యోగాలు తొలగించవచ్చా, అందుకు ఎమ్మెల్యే మద్దతు ఇస్తున్నారా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే వీఆర్ఎస్ పేరుతో పర్మినెంట్ ఉద్యోగులను తొలగించిన యాజమాన్యం, ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా వేలాది మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించింది. ఇందులో నిర్వాసితులు కూడా ఉన్నారు. ఆర్ కార్డులున్న వ్యక్తులే కాకుండా ప్లాంట్ కోసం తమ భూములు, ఇళ్లు కోల్పోయిన వ్యక్తులు కూడా ఉద్యోగం కోల్పోయినవారిలో ఉన్నారు. వారి విషయం ఎమ్మెల్యేకు పట్టదా అని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు.

ఘోస్ట్ ఉద్యోగులు, యు పాస్‌లంటూ దుష్ప్రచారం

స్టీల్‌ప్లాంట్‌లో ఘోస్ట్ ఉద్యోగులు ఉన్నారని, వారు అసలు విధులకు రాకుండా జీతాలు తీసేసుకొంటున్నారని ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం దుమారం రేపుతోంది. స్టీల్‌ప్లాంట్‌లో ఘోస్ట్ ఉద్యోగులు ఎక్కడున్నారో కూడా చెప్తే బాగుంటుందని అంటున్నారు. మరోపక్క 400 మంది కార్మిక నాయకులు యు పాస్‌ల పేరుతో పనిచేయకుండా వెళ్లిపోతున్నారని వ్యాఖ్యానించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో దాదాపు 150 మంది నాయకులకు యు పాస్‌లు ఉండేవి. వాటిని గత ఏడాది సెప్టెంబర్‌లో యాజమాన్యం తొలగించింది. అప్పట్నుంచి ప్లాంట్‌లో యు పాస్ అనే ప్రస్తావనే లేదు. కానీ యు పాస్‌లపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

కేంద్ర సాయం అప్పులు తీర్చడానికేనా?

తాము అధికారంలోకి వస్తే కార్మికులు ఉపాధి కోల్పోకుండా చేస్తామని, ప్రైవేటీకరణ అనే మాట లేకుండా చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ప్రకటలు గుప్పించారు. ఇప్పుడు సిబ్బంది తొలగింపు, ప్రైవేటీకరణ అనే అంశాలపైనే ప్యాకేజీని ప్రకటించినట్టు ప్లాంట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ ప్యాకేజీ ఇచ్చినట్టే ఇచ్చి బ్యాంకు రుణాల పేరుతో తిరిగి తీసుకున్నారు. బ్యాంకు రుణాలపై వడ్డీ తగ్గించాలని, అప్పులను ఈక్విటీలుగా మార్చాలని, సొంత గనులు ఇవ్వాలని కార్మికులు పోరాడుతుంటే రూ.14 వేల కోట్ల ఆర్థిక సాయంతో అప్పులు మాత్రమే తీర్చాలని షరతు విధించారు. దీనిపై ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని కార్మిక నాయకులు పేర్కొంటున్నారు. ఆ నిధులను జీతాల పేరుతో పంచేసుకుంటారా? అని వ్యాఖ్యానించడం పట్ల ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

అడ్వాన్స్‌డ్‌లో అదరగొట్టారు

విశాఖ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో విశాఖ విద్యార్థులు అదరగొట్టారు. జాతీయ స్థాయిలో వివిధ కేటగిరీల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. అందరితో శభాష్ అనిపించుకున్నారు. పక్కా ప్రణాళికతో చదివామని, అధ్యాపకుల సూచనలు, సలహాలు ఉపయోగపడ్డాయని విద్యార్థులు చెప్పారు. ఈ సందర్భంగా విజేతల నేపథ్యం, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకుందాం.. -డాబాగార్డెన్స్/సీతంపేట/తగరపువలస

ప్రముఖ ఐఐటీలో చేరుతా..



మా నాన్న సురేష్ సుమార్ అనకాపల్లి జిల్లాలో ఏపీఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గాను, తల్లి వసుధ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. అధ్యాపకులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 510వ ర్యాంకు సాధించాను. దేశంలోనే అత్యుత్తమ ఐఐటీలో ఎలక్ట్రానిక్స్ లేదా కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌లో చేరుతాను.

-కొడవటి శివమ్‌రామ్ ప్రత్యూష్, 510 ర్యాంకు,

రోజుకు 13 గంటలపాటు చదివా..



రోజుకు 13 గంటలపాటు చదివా. ప్రతి వారం వీక్లీ టెస్ట్‌లకు అటెండయ్యా. డౌట్స్‌ను అధ్యాపకులను అడిగి నివృత్తి చేసుకునేవాడిని. తండ్రి ప్రసాదరావు, తల్లి వీణ.. ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. అధ్యాపకులు, యాజమాన్యం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ ర్యాంకు సాధించా. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనుకుంటున్నా.

-టి.మనోహర్, 116వ ర్యాంకు

కంప్యూటర్ సైన్స్ చదువుతా..



పదో తరగతి సింహాచలం గురుకుల పాఠశాలలో చదివి 588 మార్కులు సాధించాను. ఇంటర్ సీబీఎస్ఈలో 472/500 మార్కులు వచ్చాయి. మెయిన్స్‌లో 407వ ర్యాంకు, అడ్వాన్స్‌డ్‌లో 151వ ర్యాంకు వచ్చింది. నా తల్లిదండ్రులు అంజూరి శ్రీను, ఉమ మత్స్యకారులు. చేపల వ్యాపారం చేస్తూ చాలా కష్టపడి చదివించారు. ఖరగ్‌పూర్ లేదా ముంబయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదివి ఇంజనీర్ కావాలన్నది నా లక్ష్యం.

- అంజూరి తారక్‌రామ్, 151వ ర్యాంకు, పాండ్రంకి గ్రామం

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌నవుతా..



మాది బొబ్బిలి. తండ్రి శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తల్లి అనురాధ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల ప్రోత్సహంతో 118వ ర్యాంకు సాధించాను. రోజుకు సుమారుగా 13 గంటల పాటు శ్రమించాను. కెమిస్ట్రీ వీక్‌గా అనిపించింది. కొంచెం ఎఫెక్ట్ పెట్టాను. సాఫ్ట్‌వేర్ ఇంజనీరవుతాను.

- పీటీప చక్రవర్తి, 118వ ర్యాంకు

వ్యాపారవేత్తనవుతా..



మాది బొబ్బిలి. తండ్రి కాళి రాంప్రసాద్ బిజినెస్‌మెన్. తల్లి కుమారి గృహిణి. మంచి ఐఐటీలో ఈసీఈ చదువుతాను. ఒక్క సాఫ్ట్‌వేరే కాకుండా అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలన్నదే ధ్యేయం. మంచి వ్యాపారవేత్తనవుతా. నలుగురికి ఉపాధి కల్పిస్తా. తోటివారికి సాయపడతా. తల్లిదండ్రులకు పేరు తీసుకొస్తా.

-పొట్నూర్ కార్తీక్, 419వ ర్యాంకు

వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్ ప్రారంభం



వైశ్యరాజు జ్యూయలర్స్‌ను ప్రారంభిస్తున్న జామి భోగరాజు

పీఎం పాలెం: స్థానిక కారుషెడ్ కూడలికి సమీపంలో వైశ్యరాజు జ్యూయలర్స్ తమ కొత్త భారీ షోరూమ్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించింది. కొవ్వూరి పుండరీకాక్ష రెడ్డి రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించగా, జామి భోగరాజు మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యూయలర్స్ ఎండీ వైశ్యరాజు భద్రగిరి రాజు మాట్లాడుతూ పీఎం పాలెం, మధురవాడ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన, ఆధునిక డిజైన్లలో బంగారు ఆభరణాలను అందించడానికి కారుషెడ్ మెయిన్ రోడ్డులో ఈ భారీ షోరూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని రకాల 22కే బంగారు ఆభరణాలపై 6శాతం తరుగు మాత్రమే వసూలు చేస్తామని, ఈ ఆఫర్ నగదు/యూపీఐ/ఈ-ట్రాన్స్‌ఫర్ చెల్లింపులకు వర్తిస్తుందన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరీ, జీఎస్టీ ఉండవన్నారు. కిలో వెండి వస్తువుల కొనుగోలుపై రూ.12,000 వరకు తగ్గింపు లభిస్తుంది. ఈ ప్రత్యేక ఆఫర్లు పరిమిత కాలం మాత్రమే అందుబాటులో ఉంటాయని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భద్రగిరి రాజు కోరారు. కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, సంస్థ డైరెక్టర్లు సురేష్, కిరణ్ కుమార్ రాజు పాల్గొన్నారు.

రంగంలోకి రేషన్ మాఫియా

- రేషన్ డిపోలు తెరవగానే బియ్యం మాయం
- విశాఖలో రెండుచోట్ల రేషన్ బియ్యం అక్రమ రవాణాకు బ్రేక్
- 3,999 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు



సీజ్ చేసిన రేషన్ బియ్యం నిందితులతో ఫోర్త్ టౌన్ పోలీసులు

విశాఖ సిటీ/ఎంవీపీ కాలనీ: రేషన్ డిపోలు ప్రారంభించిన రెండో రోజే రేషన్ మాఫియా మళ్లీ పురి విప్పింది. పేదల కోసం ఉద్దేశించిన బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించడానికి సిద్ధమైంది. రైల్వే న్యూకాలనీలో 1,509 కిలోలు, ఇసుకతోట కూడలిలో అక్రమంగా తరలిస్తున్న 2,490 కిలోల బియ్యం తరలిస్తున్న ముఠాకు పోలీసులు చెక్ పెట్టారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు ఇబ్బందులు లేకుండా 'ఇంటింటి రేషన్' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసరాలను ఇంటి వద్దకే అందించింది. ఇది కార్డుదారులకే కాకుండా నిరుద్యోగ యువతకు కూడా ఉపాధి కల్పించింది. ఎన్నికలకు ముందు చంద్రబాబు బియ్యం కార్డుదారులకు కందిపప్పు, గోధుమపిండి, చోడిపిండి, వంటనూనె వంటి నిత్యావసరాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చాక ఇంటింటి రేషన్ విధానానికి స్వస్తి పలికి, మళ్లీ పాత విధానంలో రేషన్ డిపోల్లోనే నిత్యావసరాలు అందించేలా ఉత్తర్వులు జారీ చేశారు.

డిపోలపై అనుమానాలు..

రేషన్ డిపోలలో సరుకులు ఇవ్వడంతో కార్డుదారులకు పాత కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. కిలోమీటర్లు ప్రయాణించి, గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి బియ్యం, పంచదార కోసం అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభించిన ఈ ప్రక్రియ ప్రహసనంగా మారింది. కొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వం ప్రజాప్రతినిధులు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమక్షంలో అట్టహాసంగా ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టింది. అయితే తొలి రోజే సర్వర్ పనిచేయకపోవడం, నిత్యావసరాల పంపిణీలో ఇబ్బందులు తలెత్తడంతో కార్డుదారులతో చీవాట్లు తినాల్సి వచ్చింది. మూడో రోజు సోమవారం కూడా అదే పరిస్థితి నెలకొంది. రేషన్ డిపోల ద్వారా నిత్యావసరాలు పక్కదారి పట్టే అవకాశాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. గతంలో చౌక దుకాణాల నుంచి టన్నులకు టన్నుల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయిన సందర్భాలు అనేకమున్నాయి. తాజాగా అదే విధానంలో మళ్లీ సరుకుల పంపిణీని చేపట్టడంతో బియ్యం, పంచదార బ్లాక్ మార్కెట్‌కు వెళ్లిపోతుందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అందరూ ఊహించినట్లుగానే, రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ చేపట్టిన మూడో రోజే బియ్యం అక్రమ రవాణా మాఫియా రంగంలోకి దిగింది. చౌక దుకాణ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధమైపోయింది. రైల్వే న్యూకాలనీలో గుట్టుచప్పుడు కాకుండా బియ్యాన్ని తరలిస్తుండగా నాలుగో పట్టణ పోలీసులు వాహనాన్ని పట్టుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని 1,509 కిలో చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఇసుకతోట కూడలిలో అక్రమంగా తరలిస్తున్న 2,490 కేజీల పీడీఎస్ బియ్యం ఎంవీపీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్‌ను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో..

విశాఖలోనే కాకుండా, అనకాపల్లి జిల్లాలోని దేవరాపల్లి మండలం ఏ.కొత్తపల్లి రేషన్ డిపోపై విజిలెన్స్, పౌరసరఫరా అధికారులు దాడులు చేయగా, 764 కేజీల బియ్యం, 25 ప్యాకెట్ల పంచదార అదనంగా ఉన్నట్లు గుర్తించారు. కార్డుదారులకు సరుకులు ఇవ్వకుండానే బయోమెట్రిక్ వేయించుకుని డిపోల నిర్వాహకులు అప్పుడే అక్రమాలకు తెరలేపినట్లు ఈ ఘటనలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో రూ.30కి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. తనిఖీలు చేపట్టిన రెండు చోట్ల అక్రమాలు, అవకతవకలు బయటపడ్డాయి. ఇతర డిపోల్లో కూడా తనిఖీలు చేపడితే మరింత మంది లీలలు బయటపడతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రెండో రోజూ అవే అవస్థలు

- కొనసాగుతున్న రేషన్ కష్టాలు
- సర్వర్ డౌన్, పనిచేయని ఈపోస్
- మండుటెండలో కార్డుదారుల నరకయాతన



కురుపాం మార్కెట్ రేషన్ డిపో నుంచి ఎండలో సరకులు తెచ్చుకుంటున్న వృద్ధురాలు



ఎల్లమ్మతోటలో రేషన్ కోసం వేచి ఉన్న కార్డుదారులు



మహారాణిపేట: రేషన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభమైన రెండో రోజు సోమవారం కూడా ప్రజల కష్టాలు కొనసాగాయి. సాంకేతిక సమస్యలు, పంపిణీలో జాప్యం కారణంగా కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా రేషన్ షాపులలో సర్వర్ మొరాయింపు, ఈ-పోస్ యంత్రాలు పనిచేయకపోవడం వంటి సమస్యలు తలెత్తడంతో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎండలో నిలబడి, క్యూలైన్లలో సరుకుల కోసం ప్రజలు పడిగాపులు కాశారు. ఈ సాంకేతిక లోపాలు పంపిణీ ప్రక్రియను మరింత క్లిష్టతరం చేశాయి.

మోత తప్పలేదు

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన 'ఇంటింటి రేషన్' పథకం ద్వారా ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసరాలు ఇంటి వద్దకే చేరేవి. దీని వల్ల వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు ఎంతో సౌలభ్యం లభించేది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను నిలిపివేయడంతో ప్రజలు మళ్లీ రేషన్ డిపోల వద్దకు వెళ్లక తప్పడం లేదు. రేషన్ డిపోల వద్ద సరుకులను మోసుకొని వెళ్లే దృశ్యాలు సోమవారం కూడా కనిపించాయి.

రెండో రోజు కేవలం 11 శాతం మాత్రమే..

జిల్లాలో రేషన్ పంపిణీ ప్రారంభమై రెండు రోజులు గడిచినా ఇబ్బందులు తప్పలేదు. మొదటి రోజు కేవలం 5.04శాతం మంది కార్డుదారులు మాత్రమే సరుకులు అందుకున్నారు. రెండో రోజు సోమవారం 11శాతం మందికి మాత్రమే సరుకులు అందజేశారు. మొత్తం రెండు రోజుల్లో 5,24,979 మంది కార్డుదారులలో కేవలం 96,019 మందికి బియ్యం పంపిణీ చేయగా, 84,384 మందికి పంచదార పంపిణీ చేశారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనంగా జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌లను తాత్కాలికంగా జతచేస్తున్నారు. ● విశాఖపట్నం-బ్రహ్మపూర్-విశాఖపట్నం (18526/18525) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రెండు జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లు. ● విశాఖపట్నం-భువనేశ్వర్-విశాఖపట్నం (22820/22819)ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రెండు జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లు. ● విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్న(18512/18511) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రెండు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు. ● విశాఖపట్నం-రాయ్‌పూర్-విశాఖపట్నం(58528/58527) పాసింజర్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్. ● విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్నం (58538/58537)పాసింజర్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్.● విశాఖపట్నం-బ్రహ్మపూర్-విశాఖపట్నం (58532/58531) పాసింజర్‌కు ఈనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్. ● విశాఖపట్నం-భవానిపట్న-విశాఖపట్నం (58504/58503) పాసింజర్‌కు ఈనెల 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్. ● విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం (58506/58505) పాసింజర్‌కు ఈనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌ను జతచేస్తున్నారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- కలెక్టర్ హరేందిర ప్రసాద్
- పీజీఆర్ఎస్‌కు 253 వినతులు

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) లో అందిన అర్జీలపై తక్షణమే చర్యలు తీసుకొని, శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అర్జీలు మళ్లీ పునరావృతం అయితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంతకు ముందు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు. ప్రతిరోజు శాఖాపరమైన సమీక్షలు నిర్వహించి, పీజీఆర్ఎస్‌కు అందిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారించి, నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా, గ్రూప్ 1, గ్రూప్ 2 అధికారు లు పేద కుటుంబాలను (బంగారు కుటుంబాలుగా గుర్తించి) దత్తత తీసుకోవాలని, వారికి విద్య, ఆరోగ్యం, నైపుణ్య అభివృద్ధి వంటి అవసరాలకు సహాయం అందించాలని కోరారు. జూన్ 21న నిర్వహించే 'యోగాంధ్ర' కార్యక్రమంలో అధికారులు చురుకుగా పాల్గొని, తమ కార్యాలయ ఉద్యోగులను, పరిసర ప్రాంతాల వారిని భాగస్వాములను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి టీ-షర్టులు, యోగా మ్యాట్‌లు అందజేస్తారని, ముందుగా వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్

253 అర్జీల స్వీకరణ

సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి మొత్తం 253 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 93, పోలీసు శాఖకు 21, జీవీఎంసీకి 77, ఇతర విభాగాలకు 62 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ సహా పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

యోగా డే.. భారం మీదే..!

ఆర్భాటంగా 'యోగాంధ్ర' అని పేరు పెట్టారు. ఐదు లక్షల మందితో యోగాసనాలు వేయించి, గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కాలని ఉబలాటపడిపోతున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పేరుతో ప్రధాని మోదీతో పాటు ఇతర ప్రముఖులను కూడా దించబోతున్నారు. భారీగా కంపార్ట్‌మెంట్లు, టెంట్లు, స్టేజ్‌లు వేసేయమని హుకుం జారీ చేసేశారు. కానీ బడ్జెట్ సంగతి అడిగితే మాత్రం, ప్రభుత్వ ఖజానా నుంచి పైసా కూడా రాలేదని అధికార యంత్రాంగం 'శీర్షాసనం' వేస్తోంది. ఈ నెల 21న జరగబోయే ఈ ప్రతిష్టాత్మక 'యోగాంధ్ర' కార్యక్రమం బడ్జెట్ కోసం అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఐదు లక్షల మందితో యోగా విన్యాసాలు చేయించడానికి దాదాపు రూ.75 కోట్లకు పైగా ఖర్చు అవుతుందని అంచనా వేశారు. కార్యక్రమానికి ఇంకా 19 రోజులే మిగిలి ఉండగా, ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. – మహారాణిపేట

- జిల్లాలో 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం
- ప్రధాని మోదీ, ఇతర ప్రముఖులు రాక
- గిన్నిస్ బుక్ రికార్డు కోసం 5 లక్షల మందితో యోగాసనాలు
- ఈ వేడుక నిర్వహణ ఖర్చు రూ.75 కోట్లగా అంచనా
- ఇప్పటి వరకు పైసా విదల్చని ప్రభుత్వం
- అధికారుల మల్లగుల్లాలు



ప్రధానితో పాటు కేంద్ర మంత్రులు, కార్యదర్శులు, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు భారీ సంఖ్యలో హాజరవుతారని చెబుతున్నారు. ఇప్పటివరకు కార్యక్రమం నిర్వహణపై సమీక్షలు, ప్రాంతాల పర్యటనలు మాత్రమే జరిగాయి. ఆర్.కె.బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు బీచ్ రోడ్డులో ఈ 'యోగా బ్రహ్మాండం' నిర్వహణ కోసం కసరత్తు చేస్తున్నారు.

500 కంపార్టుమెంట్ల నిర్మాణం

సుమారు ఐదు లక్షల మందితో యోగాసనాలు వేయించేందుకు వీలుగా బీచ్‌రోడ్డులో 500 కంపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నారు. తొక్కిసలాటలు జరగకుండా, ముందుగా ప్రజలను ఈ కంపార్ట్‌మెంట్లలోకి అనుమతించి, వారిచేత యోగాసనాలు, విన్యాసాలు చేయించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఒక్కొక్క కంపార్ట్‌మెంట్‌లో వెయ్యి మంది చొప్పున మొత్తం ఐదు లక్షల మందికి సరిపడా ఏర్పాట్లు చేస్తున్నారు. కంపార్ట్‌మెంట్ల నిర్మాణంతో పాటు, వేదికల నిర్మాణం కూడా జరుగుతోంది. ఈ వేదికల మీదుగా ప్రధానమంత్రితో పాటు ముఖ్యమంత్రి కూడా ప్రసంగించే అవకాశం ఉంది. బీచ్‌రోడ్డులోని కొన్ని ప్రాంతాలకు ఇన్‌చార్జులుగా జిల్లా అధికారులను నియమిస్తున్నారు.

భారం ఎవరిది?

'యోగాంధ్ర' కార్యక్రమానికి సంబంధించి ఖర్చు భారం ఎవరిపై పడుతుందనే దానిపై తర్జనభర్జన జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం మొదట అంగీకరించిన విధంగా 2 లక్షల మ్యాట్లు, టీ-షర్టులు మాత్రమే ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. అయితే ప్రస్తుతం 5 లక్షల మందితో యోగాసనాలు వేయించాలని నిర్ణయించ డంతో మిగిలిన 3 లక్షల మ్యాట్లు, టీ-షర్టుల భారం ఎవరు భరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒక్కో మ్యాట్ ఖరీదు సుమారు రూ.340 కాగా, 3 లక్షల మ్యాట్లకు రూ.10 కోట్లకుపైగానే ఖర్చవుతుందని అంచనా. దీంతో పాటు యోగాలో పాల్గొనే ఆహారానికి ఒక్కొక్కరికి రూ.100 ఖర్చవుతుంది. 5 లక్షల మందికి రూ.5 కోట్లు వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. వీటితో పాటు, వీఐపీలు, వీవీఐపీల హోటల్స్, కార్లు, స్టేజ్ నిర్మాణాలకు, ఇతర ఏర్పాట్లకు అయ్యే ఖర్చులు అదనం. అధికారుల పరిస్థితి చూస్తుంటే, బడ్జెట్ లేకుండానే ఐదు లక్షల మందితో యోగా చేయించాలన్న ఆశకు 'ధనాసనం' వేయక తప్పదేమో..

కోడి వ్యర్థాల అక్రమ రవాణాపై విచారణ డిమాండ్

మేయర్‌కు వినతిపత్రాలు అందజేసిన సీపీఎం ఫ్లోర్ లీడర్ గంగారావు, కార్పొరేటర్ మూర్తి యాదవ్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాస్

దాబాగార్డెన్స్: నగరంలో కోడి వ్యర్థాల సేకరణ, రవాణాలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, ప్రమాదకరమైన చీకటి వ్యాపారంపై విచారణ చేపట్టాలని కోరుతూ జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, కూటమి కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సోమవారం జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మేయర్‌కు పీలా శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ వ్యవహారంపై విచారణకు ఫ్లోర్ లీడర్లతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా నగరంలో కోడి వ్యర్థాల సేకరణ, రవాణాలో టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా తీవ్ర అనైతిక, ప్రమాదకర అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌కు తరలించకుండా, అక్రమంగా చేపల చెరువులకు తరలించి లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యర్థాలను వినియోగించిన చేపల చెరువుల్లోని చేపలను తిన్న ప్రజలు ప్రమాదకరమైన వ్యాధులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అనైతిక కుంభకోణంలో అధికార కూటమికి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉన్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని,ఈ చీకటి కార్యకలాపాలను అరికట్టాల్సిన ప్రజాప్రతినిధులే బినామీలుగా వ్యవహరించడం నేరమని వారు తీవ్రంగా విమర్శించారు. కోడి వ్యర్థాల అక్రమాలు, అవినీతిపై విచారణకు కౌన్సిల్‌లోని అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలనిడిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రికి లేఖలు

ఇదే అంశంపై కూటమి జనసేన కార్పొరేటర్ కూడా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ హరేందిర ప్రసాద్, నగర మేయర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, సీడీఎంఏ కమిషనర్‌లకు లేఖలు పంపారు.

57 ఫిర్యాదుల స్వీకరణ

సోమవారం జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 57 వినతులు అందాయి. వీటిలో నగరంలో జోరుగా సాగుతున్న అక్రమ నిర్మాణాలు, నియమ నిబంధనలకు వ్యతిరేకంగా సాగుతున్న నిర్మాణాలపై అత్యధికంగా ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవ రెడ్డి, డీసీఆర్ శ్రీనివాసరావుతో పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్‌లో ఎసెంట్ సత్తా



సత్తూరు పూజిత కృష్ణ, 2వ ర్యాంక్

మద్దిలపాలెం: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎసెంట్ విద్యార్థులు మెరిశారు. సత్తూరు పూజిత కృష్ణ ఆలిండియా రిజర్వ్‌డ్ కోటాలో 2వ ర్యాంకు సాధించాడు. అలాగే వరుసగా 247, 384, 415, 480, 744 వంటి ర్యాంకులు కళాశాల విద్యార్థులు సాధించారు. 5వేల లోపు 34 ర్యాంకులు సాధించారు. అధ్యాపక బృందానికి, ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అకాడమీ డైరెక్టర్ జి.నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

అడ్వాన్స్‌డ్‌లో నారాయణకు ర్యాంకుల పంట



ర్యాంకర్లను అభినందించిన డీజీఎం హనుమంతరావు

దాబాగార్డెన్స్: జేఈఈ-అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో విశాఖపట్నం నారాయణ హాస్టల్ విద్యార్థులు ర్యాంకుల పంట పండించినట్లు సంస్థ డీజీఎం డి.హనుమంతరావు తెలిపారు. ఓపెన్ కేటగిరీలో తాలాబత్తుల మనోహర్ 116వ ర్యాంకు, పీటీ ఆనంద్ చక్రవర్తి 118వ ర్యాంకు, ఎం.పూర్ణ సాయి 132, ఆరంగి సాత్విక్ 278, పి.ఆదివిష్ణు సుబ్రహ్మణ్యం 279, పొట్నూరు కార్తీక్ 419, కేవీ అరవిందకుమార్ 442, డి.మహిత్ 551, టి.గౌతమ్ విజయ్ కాశ్యప్ 557, బి.ఈశ్వర్ తనుజ్ 617, పి.శ్రీహర్షవర్ధన్ 635, టీవీ విష్ణు శ్రీవత్సవ 672, లక్ష్య జైన్ 741, బి.చరణ్‌తేజస్వీనాయుడు 763, అచింత్య పాండే 781, బి లక్ష్మీనివాస్ 794, పి.ప్రశాంతి కార్తీక్ 807 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు.

శ్రీవిశ్వ విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీవిశ్వ యాజమాన్యం

సీతంపేట: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని సంస్థ చైర్మన్ కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. వివిధ కేటగిరీల్లో బి.నవదీప్ రాజు 31వ ర్యాంకు, ఎ.తారక్‌రామ్ 151, ఎల్.హరికేష్ 519, సిహెచ్.వెంకట హేమవర్ధన్ 592, కె.బలరామ్ 706, బి.షణ్ముఖనాయుడు 765, యు.జయంత్‌కుమార్ 953, వై.రాజశేఖర్ 1522, డి.రవిరాజు 1917, పి.నితీష్ కుమార్ 2,396 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. మొత్తంగా వెయ్యి లోపు ఏడుగురు, 5వేల లోపు 30 మంది, పదివేల లోపు 52 మంది ర్యాంకులు సాధించారన్నారు.

తిరుమల విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో తిరుమల డైరెక్టర్లు

తగరపువలస: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తాళ్లవలస క్యాంపస్‌కు చెందిన తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఓపెన్ కేటగిరీలో కె.ఎస్.రామ్‌ప్రత్యూష్ 510, ఎస్.ఉదయపవన్ 545 ర్యాంకులు, వివిధ కేటగిరీల్లో ఎం.పురుషోత్తమరావు 39, ఆర్.చరణ్‌తేజ 86, డి.జయవర్ధన్ 226, సీహెచ్ ఉదయకిరణ్ 245, ఆర్.భరత్‌కుమార్ 272, జి.వరుణ్‌కుమార్ 309, వి.భార్గవ్ 344, కె.శ్రీరాజ్ 357, పి.భరద్వాజ్ 386, ఎం.పవన్‌కుమార్ 469వ ర్యాంకులు సాధించారన్నారు. 500 లోపు ర్యాంకులు 10, 1000లోపు 22, 1500లోపు 30, 2వేలలోపు 34, 3వేల లోపు 48, 5వేల లోపు 77, 10వేలలోపు 126 మంది ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

తొట్లకొండపై యోగా శిబిరం చట్టం ఉల్లంఘనే..

విశాఖ సిటీ: ప్రాచీన బౌద్ధ క్షేత్రం తొట్లకొండపై యోగా శిబిరం నిర్వహించడం సరికాదని ఇంటాక్ ఛాప్టర్ మాజీ కన్వీనర్ రాణీ శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు సోమవారం ఫొటోలతో పాటు లేఖ రాశారు. భీమిలి బీచ్ రోడ్డులోని రాష్ట్ర రక్షిత పురావస్తు బౌద్ధ స్థలంలోని యోగా శిబిరం నిర్వహించడం పురాతన కట్టడాలు, పురావస్తు ప్రదేశాలు, అవశేషాల చట్టం -1958 (ఏఎంఏఎస్ఆర్-1958) ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్నారు. ఈ బౌద్ధ క్షేత్రంపై రెండు వేల సంవత్సరాల సున్నితమైన ఇటుక నిర్మాణాలు, పునాదులు ఉన్నాయని వివరించారు. ఆ పురాతన అవశేషాల మధ్యలో తివాచీలు పరిచి, ఒక టెంట్ నిర్మించినట్లు ఫొటోల్లో స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈ ఏర్పాట్ల కోసం కొండపై లెవలింగ్ చేశారా? దాని కోసం పురాతన ఇటుకలను తొలగించారా? ఏవైనా నిర్మాణాలు చెదిరిపోయాయా? అనేది తెలియాల్సి ఉందన్నారు. ఆ ప్రదేశాన్ని పరిరక్షించాల్సిన అధికారులే చట్టాన్ని ఉల్లంఘించేలా ఒక స్పాన్సర్డ్ కార్యక్రమాన్ని నిర్వహించడం బాధాకరమన్నారు.

అడ్వాన్స్‌డ్‌లో శశి ముందంజ



షేక్ ఆజాం ఖాన్, హర్షవర్థన్, దండె స్టీఫెన్

తగరపువలస: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ సంగివలస క్యాంపస్ విద్యార్థులు ముందంజలో నిలిచారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ తెలిపారు. వివిధ కేటగిరీల్లో షేక్ ఆజాం ఖాన్ 16వ ర్యాంకు, పాకలపాటి హర్షవర్ధన్ 124, దండె స్టీఫెన్ 169, నిడిగట్టు తేజశ్రీ 339, బొడ్డేడ బాల అనిక్ 396, పడాల లిఖిత్ కృష్ణ 928, పొన్నపు స్వరూప 930వ ర్యాంకులు సాధించారన్నారు. 1000లోపు ఏడుగురు, 2వేల లోపు 14, 5వేల లోపు 33, 10వేల లోపు 59 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకర్లను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ అభినందించారు.

పోలీసులపై దాడి కేసులో ఇద్దరికి జైలు

విశాఖ లీగల్: విధి నిర్వహణలో ఉన్న పోలీసులను దూషించి, దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ నాల్గో అదనపు ప్రధాన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె. వాసుదేవ రావు సోమవారం తీర్పునిచ్చారు. ఈ కేసు వివరాలను సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. సూర్యకుమార్ వెల్లడించారు. చినగదిలి ప్రాంతానికి చెందిన వి. లక్ష్మీ అపర్ణ, ఎ. రాజ్‌కుమార్ స్నేహితులు. 2021, జూన్ 5వ తేదీన కరోనా లాక్‌డౌన్ సమయంలో, రామాటాకీస్ జంక్షన్ వద్ద మూడో పట్టణ ఎస్ఐ డి. రాము, మహిళా హోంగార్డు ఎస్.జి. రత్నంతోపాటు ఇతర పోలీసులు ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సమయంలో ద్విచక్రవాహనంపై వస్తున్న రాజ్‌కుమార్‌ను పోలీసులు ఆపి, కరోనా సమయంలో బయటకు రావడానికి గల కారణాన్ని విచారించారు. ఎటువంటి సరైన కారణం లేకపోవడంతో, లాక్‌డౌన్ నిబంధనల ఉల్లంఘనగా భావించి జరిమానా విధించారు. దీంతో కొద్దిసేపటి తర్వాత నిందితుడు రాజ్‌కుమార్‌తో పాటు అతని స్నేహితురాలు లక్ష్మీ అపర్ణ సంఘటన స్థలానికి వచ్చి, పోలీసులతో గొడవపడి, అసభ్య పదజాలంతో దూషించారు. ఈ క్రమంలో లక్ష్మీ అపర్ణ దాడి చేయడంతో, మహిళా పోలీసు హోంగార్డు ఎస్.జి. రత్నానికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ డి. రాము ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితురాలు లక్ష్మీ అపర్ణకు ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 6,000 జరిమానా విధించారు. అలాగే నిందితుడు రాజ్‌కుమార్‌కు మూడు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 1,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

విత్తన బంతులతో సామాజిక వనాలు



విత్తన బంతులను చల్లుతున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: విత్తన బంతులతో సామాజిక వనాలు పెంచడం అవసరమని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. సోమవారం వీఎంఆర్‌డీఏ, సిఫా, గ్రీన్ అంబాసిడర్స్, ఎస్ఆర్‌యూ-జీవీఎంసీ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవోల నేతృత్వంలో 20 వేల విత్తన బంతులను కైలాసగిరిపై చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషధ గుణాలున్న, పక్షులు గూళ్లు పెట్టుకునే, పక్షులకు ఇతర జీవులకు ఆహారాన్ని ఇచ్చే చెట్ల విత్తనాలతో విత్తన బంతులు తయారు చేయించాలని సూచించారు. మెట్రోపాలిటిన్ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ దేశీయ ఆవు పేడ, ఒండ్రు మట్టి, ఔషధ గుణాలు కలిగిన, పక్షులు గూళ్లు పెట్టుకునే, వాటికి ఆహారాన్నిచ్చే చెట్ల విత్తనాలతో ఈ విత్తన బంతులు తయారు చేసినట్లు చెప్పారు. సిఫా ట్రస్ట్ సీఈఓ డాక్టర్ శశి ప్రభ మాట్లాడుతూ సిరిమాను, అడ్డాకు, మర్రి, రావి, జువ్వి, నేరేడు, మారేడు, కరక్కాయ, తానికాయ, ఉసిరికాయ, దేవకాంచన, ఇండియన్ చెర్రీ, కుంకుడు, మామిడి, వేప, రేగు, సీమచింత, గుగ్గిలం, వెదురు, బిల్, చింత, పనస, ఇలా అనేక చెట్ల విత్తన బంతులు వినియోగించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీపీసీబీ రీజనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పి.వి.ముకుందరావు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఎస్ఆర్‌యూ-జీవీఎంసీ ప్రాజెక్ట్ ఇంజనీర్ దాట్ల వివేక్ వర్మ, వీఎంఆర్‌డీఏ డీఎఫ్ఓ సుజాత శివాని, కైలాసగిరి హార్టీకల్చర్ ఆఫీసర్ రమేష్, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, గ్రీన్ వాలంటీర్ ఐ.కృష్ణకుమారి, ఎస్ఆర్‌యూ-జీవీఎంసీ ప్రతినిధి మంగరాజు, గ్రీన్ అంబాసిడర్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.